క్లుప్తంగా

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

అశ్వారావుపేట: స్థానిక వీకేడీవీఎస్ రాజు డిగ్రీ కళాశాలలో సోమవారం హెటిరో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని విశేష స్పందన లభించింది. ఈ జాబ్ మేళ కార్యక్రమాన్ని అశ్వారావుపేట నియోజక వర్గ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి దాదాపు 300 మంది నిరుద్యోగులు హాజరు కాగా వారందరికీ రాత పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఇంటర్వ్యూలు చేసి వారిలో 75 మందిని ఎంపిక చేశారు. ఎంపికైనా వారికి ఆఫర్ పత్రాలను అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.శేషుబాబు, హెటిరో సంస్థ హెచ్ ఆర్ హెడ్ జయపాల్ రెడ్డి, సుధీర్ శివసాయి, ప్రవీణ్, సత్యానంద్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలి..

చంద్రుగొండ: పాఠశాల విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షా ప్రాజెక్ట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని సమగ్ర ఉద్యోగులసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాణోత్ సేవ్యా నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేజీబీవీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఆరునెలల వేతనంతోకూడిన ప్రసూతీ సెలవులు మంజూరు చేయాలన్నారు. గురుకుల పాఠశాలల్లో టీచర్ల నియామకాల్లో సీఆర్పీ సమగ్ర ఉద్యోగులకు 30శాతం వేయిటేజీ ఇవ్వాలన్నారు. పీఎఫ్, బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని కోరారు.

ధరలు తగ్గించాలని రాస్తారోకో

చంద్రుగొండ: విపరీతంగా పెరిగిన నిత్యవసర వస్తువులు కూరగాయల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక జూలూరుపాడు రోడ్డుపై సోమవారం రాస్తారోకో చేశారు. ధరల పెరుగుదలతో పేద మధ్యతరగతి వర్గాల ప్రజల జీవనస్థితిగతులు అగమ్య గోచరంగా మారాయని, ధరలను ప్రభుత్వం వెంటనే నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఆ పార్టీ నాయకులు ఐలూరి రామిరెడ్డి, సర్పంచ్ కాక సీత, పెద్దిని వేణు, రాయి రాజా, విప్పర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాగభూషణం స్ఫూర్తితో ఉద్యమించాలి

దుమ్ముగూడెం: దివంగత రావులపల్లి నాగభూషణం స్ఫూర్తితో ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని వారి కుమారులు సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు రావులపల్లి రాంప్రసాద్, రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నరసాపురం గ్రామంలో నాగభూషణం 7వ వర్ధంతి సందర్భంగా నాగభూషణం స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో దుమ్ముగూడెం సొసైటీ చైర్మన్ కిలిమి ఎల్లారెడ్డి, మండపాటి సుధాకర్ రెడ్డి, రావులపల్లి పృథ్వీ, చెంచల కృష్ణ, మైదిన్, నాగభూషణం మనవరాలు రావులపల్లి సింధు, స్వర్ణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లో పేద ప్రజల సంక్షేమం కోసం కష్టపడ్డ నాయకుడు రావులపల్లి నాగభూషణం ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్‌కుమార్ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో రావులపల్లి నాగభూషణం 7వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లలర్పించారు. కార్యక్రమంలో మురాల డానియల్ ప్రదీప్, రాము, తాటి పసి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక చేయుతను ప్రతి ఒక్కరూ చేయుతను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరికిల్ల తిరుపతిరావు అన్నారు. పట్టణంలోని లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం ఆయన అందజేశారు. సుందరయ్య కాలనీకి చెందిన బి.వెంకన్నకు రూ.38 వేలు, శాంతినగర్ కాలనీకి చెందిన పూజితకి రూ.68 వేల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొండిశెట్టి కృష్ణమూర్తి, బల్లా రాంబాబు, చింతాడి చిట్టిబాబు, రవికుమార్ పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులపై వినతి

అశ్వాపురం: మండల పరిధిలోని చింతిర్యాల క్రాస్ రోడ్డు నుంచి చింతిర్యాల వరకు రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్ సోమవారం మణుగూరులో ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును ప్రత్యేకంగా కలిసి విన్నవించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే రేగా పంచాయతీరాజ్ డీఈతో మాట్లాడి చింతిర్యాల బీటీ రోడ్డు మరమ్మతుల పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. చింతిర్యాల, చింతిర్యాల కాలనీ గ్రామ పంచాయతీల ప్రజల పక్షాన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అశోక్ తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

మణిపూర్ రాష్ట్రంలో గిరిజన మహిళలపై సామూహిక అత్యాచారం, హత్య చేసిన దుండగులను శిక్షించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. అక్కడి ఆకృత్యాలకు నిరసనగా పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీలు, ప్రదర్శనలు చేపట్టారు. మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా మణిపూర్‌లో రెండు తెగల మధ్య గొడవలు జరుగుతున్నప్పటికీ.. ఆ అరాచకంపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమని విమర్శించారు. తక్షణమే దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని, ఆ రాష్ట్రంలో శాంతి భద్రతలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



గుండాల: పోతిరెడ్డిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీడబ్ల్యూ నాయకులు


విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు


చంద్రుగొండ: నిరసన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, నాయకులు


భద్రాచలంటౌన్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు


మణుగూరురూరల్: మాట్లాడుతున్న అంతోటి నాగేశ్వరరావు


బూర్గంపాడు: నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


చంద్రుగొండ: జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ

దమ్మపేట: డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుక్రుత మండలంలో పర్యటించి, పలు ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి, వార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలోని మెడికల్ రికార్డులను తనిఖీ చేసి, ప్రభుత్వ వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని, సాధారణ, వైరల్ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. దమ్మపేటలోని బాబు నర్సింగ్ హోమ్‌ను సందర్శించి, తనిఖీలు చేశారు. అనుమతుల పరిధిని దాటి ఆస్పత్రిని నిర్వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మారప్పగూడెం ఆశ్రమ పాఠశాలలో జరుగుతున్న వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీపీహెచ్ ఎన్.అన్నామేరీ, ప్రభుత్వ డాక్టర్ మణిదీప్, సూపర్వైజర్లు భద్రమ్మ, రామారావు పాల్గొన్నారు.


దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డులను తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుక్రుత

లక్ష్మీనగరంలో ‘కలక’ కలవరం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో కళ్ల కలక సమస్య తీవ్ర కలవర పెడుతోంది. గ్రామంలో సుమారు 30 మంది వరకు కళ్ల కలక సమస్యతో బాధపడుతున్నారు. సాధారణంగా వర్షాకాలంలో ఈ సమస్య అధికంగానే కనిపిస్తుంది. అయితే గతంలో ఎన్నడూలేని విధంగా లక్ష్మీనగరం గ్రామంలో ఇంత మంది బాధితులుగా మారుతుండడం విశేషం. కళ్ల కలకకు ఒకరినుంచి మరొకరికి వ్యాప్తి చెందే గుణం ఉండడంతో ఎక్కువ మంది బాధితులుగా మారుతున్నారు. వీరిలో ఎక్కువగా పిల్లలు ఉండడం గమనార్హం. స్కూళ్లల్లో విద్యార్థులంతా కలసి ఉండడంతో ఒకరికి ఉన్నా మిగతా విద్యార్థులకు కూడా త్వరితగతిన వ్యాప్తి చెందుతోంది. వాతావరణం మార్పులు, రసాయనాలు, వాహనాల పొగ, దుమ్ము ధూళి, పెంపుడు జంతువుల వల్ల కళ్ల కలక వస్తుందని వైద్యులు చెబుతున్నారు. కళ్లు ఎర్రబడడంతో పాటు మంట, నీరు కారడం, దురద వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి తగిన మందులు వాడాల్సి ఉంటుంది.

సొంత వైద్యంతో సమస్యలు..

గత 3రోజుల నుంచి కళ్ల కలక సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంది. కళ్ల కలక సమస్యతో ఇబ్బంది పడేవారు సొంత వైద్యంతో సమస్యలు పెరుగుతాయి. బాధితులు కంటి వైద్యుల సలహాలు పాటించాలి. పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ సమస్య ఉంటే రెండు రోజులు విశ్రాంతి తీసుకోవడం మంచిది. దీనివల్ల ఎక్కువ మందికి వ్యాప్తి చెందకుండా ఉంటుంది. నాలుగు నుంచి వారం రోజుల్లో సమస్య తగ్గిపోతుంది. ప్రభుత్వ వైద్యశాలల్లో కళ్ల డ్రాప్స్ అందుబాటులో ఉన్నాయి.

కళాశాల పనులు పరిశీలన

మణుగూరురూరల్: మణుగూరులో నూతనంగా చేపడుతున్న పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధి పనులను ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సోమవారం సందర్శించి పరిశీలించారు. పనుల పురోగతి వివరాలను అధ్యాపకులను, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కళాశాల పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు అడపా అప్పారావు, నవీన్, రాంరెడ్డి, మేకల రవి, బాబురావు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న విప్ రేగా కాంతారావు

జ్వరాలు వస్తే నిర్లక్ష్యం చేయొద్దు



గోపన్నగూడెంలో ఆరోగ్య శిబిరం..

అశ్వారావుపేటరూరల్: ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులతోపాటు జ్వరాలు విజృంభిస్తాయని, జ్వరాలు వస్తే నిర్లక్ష్యం చేయవద్దని గుమ్మడవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మధుళిక అన్నారు. మండలంలోని మేకలబండ, రమణక్కపేట, ఖమ్మంపాడు గిరిజన గ్రామాల్లో సోమవారం ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జ్వరాలు, ఇతర వ్యాధుల గురించి వివరాలు సేకరించారు. జ్వరాలతో బాధ పడే వారికి వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. అలాగే గోపన్నగూడెం గ్రామంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. 39 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొంది లక్ష్మణ్‌రావు, హెచ్‌వీ దుర్గమ్మ, సిబ్బంది భాస్కర్, ఏఎన్ఎంలు రాధాబాయి, స్వరూప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య శిబిరం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో సోమవారం ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. మండల వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత, గురుకుల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, హెచ్ఈఓ కృష్ణయ్య, హెచ్ఎస్ నాగేశ్వరరావు, ఆశాలు అనురాధ, కరుణ, కవిత పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దమ్మపేట: అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, పొంగులేటి ప్రధాన అనుచరుడు జారే ఆదినారాయణ, మండలంలో పలువురిని పరామర్శించారు. సోమవారం మండల పరిధిలోని నాగుపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పానగంటి వెంకయ్య, మాధవరెడ్డి వెంకటరెడ్డిలను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.

గ్రామంలో మాజీ సొసైటీ డైరెక్టర్ పెంకె నాగరత్నం అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం దమ్మపేటలో సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మికులకు సంఘీభావం తెలిపి, వారికి భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రావు గంగాధరరావు, చిన్నశెట్టి యుగంధర్, యర్రగొర్ల రాధాకృష్ణ, పర్వతనేని ప్రసాద్, కక్కిరాల రమేష్, చక్రాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు

రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని స్థానికంగా పలు నియోజవర్గాల్లో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు కేట్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. మణుగూరులో ప్రభుత్వ విప్ రేగా సుమారు 2వేల గొడుగులను పంపిణీ చేశారు. అశ్వారావుపేట బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బిస్కెట్, చాక్లెట్‌లు పంపిణీ చేశారు. బూర్గంపాడులో బీఆర్ఎస్ నాయకులు మొక్కలు నాటారు. బూర్గంపాడు, అశ్వాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వారావుపేటరూరల్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు


బూర్గంపాడు: సారపాకలో మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు


దుమ్ముగూడెం: పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట–2 ఎస్సైగా సోమవారం పి.శివరామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ రెండో ఎస్సైగా పని చేస్తున్న రఫీని కొత్తగూడెం సీసీఎస్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో కొమరారం పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న శివరామకృష్ణను ఉన్నతాధికారులు నియమించిన సంగతి తెలిసిందే. దాంతో ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో విధుల్లో చేరారు.

గుండాల: కొమరారం(కాచనపల్లి) ఎస్సైగా బి. గిరిదర్ రెడ్డి సోమవారం విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్సై శివరామక్రిష్ణ అశ్వారావుపేటకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఖమ్మం నుంచి గిరిదర్ రెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

అశ్వాపురం: సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ కరకట్టతో మండలంలోని బట్టీలగుంపు గ్రామపంచాయతీ పరిధి పాములపల్లి గ్రామంలో పలువురు రైతుల పంటలు నీటమునిగాయి. ఈ మేరకు 18 ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని బట్టీలగుంపు సర్పంచ్ బట్టా సత్యనారాయణ కోరారు. ఈ మేరకు రైతులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

డిప్యూటేషన్లు రద్దు చేయాలి

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో జరిగిన అక్రమ డిప్యూటేషన్లపై విచారణ జరిపి సక్రమంగా లేని వాటిని రద్దు చేయాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ అధ్యక్షులు పాయం సత్యనారాయణ ఆధ్వర్యంలో పీఓకు వినతిపత్రం అందచేశారు. బుధవారం ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం వారు దర్బారులో పీవోను కలిసి సమస్యను విన్నవించారు. సర్దుబాటును అన్ని పాఠశాలలకు వర్తింప చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సున్నం సుబ్బయ్య, పూనెం నాగేశ్వరావు, సున్నం నాగమణి తుర్సం విజయ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు గిరిజనుల వినతి

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం గ్రామానికి చెందిన కొందరు గిరిజన రైతులు పోడు పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్ పాయం భద్రమ్మ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రియాంక అలకు వినతిపత్రం అందజేశారు. 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం తమ పోడు భూములకు పట్టాలు ఇచ్చిందని, ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం తమ భూములకు పట్టాలు ఇవ్వలేదని పోడు పట్టాలు ఇచ్చి న్యాయం చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు.

ఠాక్రేను కలిసిన మాజీ ఎమ్మెల్యే

కరకగూడెం: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రేను మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ జెడ్పీచైర్మన్ చందా లింగయ్య దొర సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పినపాక నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులను వివరించారు. పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు చందా సంతోష్ కుమార్ తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య చేతుల మీదుగా 37మందికి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. మండల అభివృద్ధి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. మాట్లాడుతూ..పెళ్లి సమయానికి లబ్ధిదారులకు చెక్కులు అందేలా చర్యలు తీసుకుంటే నిరుపేద తల్లిదండ్రులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎంపీపీ లక్ష్మి, తహసీల్దార్ మణిధర్, ఎంపీడీఓ ముత్యాలరావు, ఎంపీటీసీ వనజ పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ఎంపీపీ రేసు లక్ష్మి

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కరకగూడెం: సీఎం కేసీఆర్ మైనారిటీలకు రూ.లక్ష సాయం ప్రకటించడంపై మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎంపీపీ రేగా కాళికతో కలిసి మైనారిటీలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సోందుపాషా, మైనార్టీ నాయకులు యాకుబ్ ఖాన్, ఫజల్ హుస్సేన్, ఖలీల్ పాషా, రఫీఖ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: వీఆర్ఏల క్రమబద్ధీకరణ చేస్తూ పేస్కేలుపై ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై హర్షం వ్యక్త చేస్తూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సోమవారం మండలంలోని వీఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు ప్రదీప్, శేఖర్, నాగయ్య, హరీష్, వెంకట్, నరేష్, కన్నమ్మ, ముత్యం, వీఆర్ఏలు పాల్గొన్నారు.

పార్టీల్లో చేరికలు

బీఆర్ఎస్‌లో..

మణుగూరురూరల్: మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 30 కుటుంబాల వారు పలు రాజకీయపార్టీలను వీడి ఆదివారం ఎమ్మెల్యే రేగా కాంతారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే బీఆర్ఎస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో..

మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కోటకట్ట (హరిజ నవాడ) గ్రామ యువకులు ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకుడు షేక్ ఆరీఫ్ పాషా, మండల నాయకులు పాడుతూరి ఈశ్వర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర కార్యదర్శి ధనసరి సూర్య సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి సూర్య పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ యూత్ కార్యదర్శి పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకులు నాయకులు రావుల కృష్ణ, జిల్లా కార్మికశాఖ అధ్యక్షురాలు వరలక్ష్మి, యువజన నాయకులు సాంబశివరావు, కోమటిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రహీం ఖాన్, అసిఫ్ పాషా, నరేష్, కల్యాణ్, సురేష్, వరప్రసాద్, దేవి, పాదిల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంలో..

దుమ్ముగూడెం: మండలంలోని జెడ్ వీరభద్రపురానికి చెందిన కొమరం చంటి తిరిగి సీపీఎంలో చేరారు. గతంలో ఆయన ఎస్ఎఫ్ఐ, సీపీఎంలో కొనసాగాగా కొంతకాలం దూరంగా ఉన్నారు. తిరిగి సోమవారం సీపీఎంలో చేరారు. దీంతో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, యలమంచి రవికుమార్, కారం పుల్లయ్య, యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, కొర్స చిలకమ్మ, మర్మం సమ్మక్క, కాక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

27న కలెక్టరేట్ ముట్టడి

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె 19వ రోజు సోమవారం కొనసాగింది. నిరవధిక సమ్మెలో భాగంగా, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. తాత్కాలిక కూలీలతో పనులు చేపడుతున్న పారిశుద్ధ్య పనులను అడ్డుకున్నారు. పలువురు నాయకులు, సంఘాల వారు సమ్మె శిబిరాలను సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. ఈ నెల 27న కలెక్టరేట్ ముట్టడి అనంతరం, సమ్మెను అఖిల పక్ష పార్టీల మద్దతుతో ఉధృతం చేస్తామని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


దమ్మపేట: 19 ఆకారంలో కూర్చొని నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు


అశ్వారావుపేటరూరల్: ఉరితో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు


గుండాల: ట్రాక్టర్‌ను అడ్డుకున్న కార్మికులు